# ఏడడుగులు

పెళ్ళిళ్ళ గురించీ, పెళ్ళికొడుకుల గురించి చెప్పుకుని, నాతి చరామి అని అనుకున్నాక, ఏడడుగులు అంటే ఇదేదో సప్తపది అనుకోవద్దు. ఈ ఏడడుగులు ఆ ఏడడుగులు కాదు. మేనేజ్మెంట్ కోర్సుల్లో చెప్పుకునే ఏడడుగులు. సెవెన్ స్టెప్స్ టు కాన్ఫ్లిక్ట్ మేనేజ్మెంట్. కార్పొరేట్ వ్యాపార రంగంలో వివాద పరిష్కారాలకి అవసరమైన ఏడు సోపానాలు. ఏడు పద్ధతులు.

'ఏదో సరదాగా కాలక్షేపానికి ఎన్నారై కబుర్లు చదువుకుందా మనుకుంటుంటే, మేనేజ్మెంట్ కోర్సుల గురించి మాకెందుకు చెప్పండి. మీ పాఠాలు వినటానికి మాకు తీరిక లేదు. టాటా, గుడ్‌బై, ఇంక శెలవు' అనిపించుకోకుండా ముందే చెప్పేస్తున్నాను, నేను ఈ విషయం మీద ఎందుకు వ్రాస్తున్నానో.

వివాదాలు ఒక్క ఆఫీసులకే పరిమితం కాదు. భార్యాభర్తల మధ్యా, అత్తాకోడళ్ళ మధ్యా, అక్కా చెల్లెళ్ళ మధ్యా, స్నేహితుల మధ్యా, మధ్యే మధ్యే మీకూ నాకూ మధ్య వస్తునే వుంటాయి. వాటి పరిష్కారానికి కూడా, ఇవి ఎంచక్కా సరిపోతాయి. హందుకని ఈ ఏడడుగుల గురించీ నాలుగున్నర ముక్కలు మనలాటి సామాన్యుల జీవితంలో జరిగే సంఘటనలతో చెబుదామని ఈ ప్రయత్నం.

0 0 0

'ఇదిగో సుబ్బారాయుడూ! నువ్వు సుబ్బరంగా ఏ పనీ చేయవేమిటి? ఈ ఫైల్ చూడు ఎలా తగలేశావో' అని ఆఫీసరాసురుడు అంటే, మరి సుబ్బారాయుడికి అరికాలి మంట నెత్తికెక్కదూ.

సుబ్బారాయుడు వూరికే వూరుకునేవాడు కాదు కనుక, ఆయన కస్సుమంటే ఈయన బుస్సుమంటాడు. దానితో వివాదం. అరుపులు. అప్పుడు ఎవరి బలాబలాలకి బలముందో వాళ్ళు పై చేయి అయి రెండోవాళ్ళు చులకనయే అవకాశం వుంది. ఆఫీసులో చక్కటి వాతావరణం నెలగొల్పే అవకాశం చేయి జారిపోతుంది.

అందుకని మనుష్యులని వదిలేసి, విషయం మీద మాటలు కేంద్రీకరిస్తే వివాదాలు రావు అనేది మొదటి సూత్రం.

'సుబ్బారాయుడూ! నువ్వు చాల కష్టపడి పని చేస్తున్నావయ్యా. కాకపోతే ఇవాళ ఇదిగో ఈ కాగితం మీద వ్రాసింది అంత బాగోలేదు. దీన్నిలా వ్రాసే బదులు ఇట్లా వ్రాస్తే బాగుంటుంది కదూ. నువ్వేమంటావ్?' అంటే మన సుబ్బారాయుడు, 'అవును సార్. నిజమే. మీరు చెప్పిందే బాగుంది. అలాగే మారుస్తాను' అనకేం చేస్తాడు మరి.

అంటే విషయాన్ని వ్యక్తిగతంగా కాకుండా విషయపరంగా చెబితే వివాదాలు రావు అని. మరి ఆఫీసరుడు చెప్పింది సుబ్బారాయుడికి విషయపరంగా నచ్చకపోతే? నష్టమేమీ లేదు. అది విషయపరం కాబట్టి, దాని మీదే ఇద్దరూ చర్చించి, ఒక అంగీకారానికి రావచ్చు. అందుకే ఈ ఏడడుగులలోనూ ఇది మొదటిది.

0 0 0

కోడలు సావిత్రి మీద ధాష్టీకం చేస్తుంటుంది అత్తగారు సూర్యకాంతం.

ఎడం చేయి వూపుతూ, 'ఏమిటే! నేను ఎంత చెబుతున్నా నీకు లెఖ్ఖలేదు. అత్తగారని కనీసం గౌరవం లేదు. ముందు ఈ పని చేస్తావా లేదా?' అని సినిమా సూర్యకాంతంలా అరుస్తుంటుంది.

మరి ఆనాటి సినిమా సావిత్రిలా కోడలు సావిత్రి భయపడుతూ, స్వగతంలో ఏడుస్తూ, తలకాయ వూపి చీపురు తీసుకుని పనిలోకి దిగుతుంది. అదే కోడలు, సావిత్రిలా కాకుండా జమున అయితే? చెరో చీపురూ తీసుకుని, యుద్ధం లోకి దిగుతారు. అంటే మళ్ళీ వివాదం. ఇక్కడ జరిగిందేమిటి? అత్త హోదా, కోడలు మీద చూపించటం.

అదే కూడదంటారు, వివాదాలు వద్దనే వివేకులు. నువ్వూ నీ లెవెలూ కాదు బాబూ చూపించాల్సింది. పని మీద ఇష్టం చూపించు. పెంచు. రెండు మెట్లు దిగి, చేతనైనంత సహాయం కూడా చేయి. వాళ్ళంతట వాళ్ళే నీకు సహాయం చేస్తారు. ఇది రెండవ మెట్టు.

0 0 0

'నాకో వెయ్యి రూపాయిలో రెండో అప్పివ్వు. అద్దంకి పోయి రాగానే ఇస్తాను' అన్నాట్ట అప్పారావు.

వెంటనే అడిగిన మూడు వేలూ అప్పిచ్చాట్ట తంగవేలు. తర్వాత కథ మీకు తెలుసని నాకు తెలుసు. అప్పారావు అసలు అద్దంకి వేపే పోకుండా, నేల మీదే కాకుండా తన మాట మీద కూడా నిలబడ్డాడు. మూడు వేలూ పోగొట్టుకున్న తంగవేలు, ముందే అన్నీ సరిగ్గా మాట్లాడుకొని వుంటే, వేలు పోగొట్టుకుని నోట్లో వేలేసుకుని కూర్చునే బాధ తప్పేది కదా అని స్వగతంలో విచారించాడు.

ఇదే మూడో సూత్రం. ఫలానా విషయం, ఫలానా రోజు లోపల, ఫలానా విధంగాచేయాలి అనుకోవడం. 'ఆబ్జక్టివ్ క్రైటీరియా' అంటారు పాశ్చాత్య భాషలో. అన్నీ క్షుణ్ణంగా, అనుమానాలు లేకుండా ముందే అనుకోవటం వల్ల విబేధాలు వచ్చే

అవకాశం లేదు.

0 0 0

మనింట్లో పెళ్ళవుతున్నదనుకోండి. అస్మదీయుల మందరం ఒకచోట కూర్చుని వేడి వేడి పకోడీలు తింటూ, అందరి అనుభవాలూ వింటూ పెళ్ళి కార్యక్రమంలో చేయవలసిన పనులన్నీ వ్రాసుకుంటుంటాం. అక్కడ వున్న అందరూ ఈ విషయంలో తెలిసిన వాళ్ళే కనుక, వాళ్ళకి తెలిసినవన్నీ చెబుతుంటారు. దాన్నే అమెరికన్ కార్పొరేట్ ప్రపంచంలో 'బ్రైన్ స్టార్మింగ్' అంటారు. ఇక్కడ ఆఫీసుల్లో కూడా ఈ 'బుర్ర పగులగొట్టుకోవటాలు' ఒక పద్ధతి ప్రకారం చేస్తుంటారు.

దీనివల్ల లాభాలేమిటి? నాకు తెలిసింది మీకు తెలియకపోవచ్చు. మీకు తెలిసింది నాకు తెలియకపోవచ్చు. ఇలాటి కొన్ని బుర్రలు కలిస్తే, అందరి అనుభవాలతోనూ పని సవ్యంగా జరిగిపోతుంది. ముందే అందరూ చర్చించి, అమలు పరచటానికి ఒక ప్లాను సిద్ధం చేస్తారు కనుక, విబేధాలకీ వివాదాలకీ అవకాశం వుండదు. అందుకే తరువాత వివాదాలేమీ రాకుండా చూడటానికి ఈ రెండు పద్ధతులూ కూడా అవసరం. ఒకటి బ్రైన్ స్టార్మింగ్ (నాలుగోది), రెండవది తత్ఫలితంగా నిర్ణయింపబడ్డ ఒక ప్లాను (ఐదోది).

0 0 0

విబేధాలు రాకుండా చూసుకోవటానికి, ఇప్పటికి ఐదడుగులు వేశాం. మరి మిగతా రెండూ.... ?

అవునండీ. వ్యక్తి మీద కాకుండా విషయం మీద దృష్టి పెట్టమన్నారు. పెట్టాం. పదవి మీద కాకుండా పని మీద ఇష్టం పెరిగేలా చూడమన్నారు. చూశాం. ఫలానా రోజున ఫలానా ఫలానా అనుకోమన్నారు. అనుకున్నాం. పకోడీలు తినమన్నారు. తిన్నాం. కాదు పకోడీలు తింటూ, బుర్రలు కలిపి ఆలోచించమన్నారు. చించాం. పనిలో పని అక్కడే ఒక ప్లాన్ తయారు చేసుకోమన్నారు. చేశాం. మరి ఇంతా చేసి, ఆ కార్యక్రమమేదో సవ్యంగా నిర్వహించవద్దూ?

'భలే వారే మీరు. మిగతా రెండూ మీరే చెప్పేశారు. ఆరోది, అనుకున్న ప్లాను ప్రకారం పని లేదా ప్రాజెక్టు పూర్తి చేయటం. ఏడోది పూర్తయాక, సరిగ్గా అన్నీ సవ్యంగా జరిగాయా, ఏదన్నా మరిచిపోయామా, ఇంకోసారి అలాటిదే చేస్తే, ఎలా దాన్ని మెరుగుపరచవచ్చు అని చర్చించటం.

ఈ ఏడూ తూచా తప్పకుండా పాటిస్తే, ఆఫీసుల్లో వివాదాలూ విబేధాలూ రాకుండా తప్పించవచ్చు అని ఈ రంగంలోని నిపుణుల అభిప్రాయం. ఇది నా అనుభవంలో, ఇంటా బయటా చూడటమే కాకుండా, దీని గురించి తెలుసుకున్నాక ఆచరణలోనూ పెట్టాను. ఫలితాలు ఇప్పటిదాకా బాగానే వున్నాయి మరి!

0 0 0